25

ఉదయం పదిగంటల వేళ...

ఆకాశంలోని సూర్యుడు విస్ఫులింగాలను వెదజల్లుచున్నాడు.

ప్రచండ భానుని కిరణాల వేడికి తాళలేనట్టుగా సముద్రకెరటాలు ఒడ్డుకు పరుగెడుతున్నాయి.

నిర్మానుష్యంగా వున్న పామ్‌బీచ్‌లో కూర్చున్నారు శిల్ప, యోగేంద్రలు.

అవనత వదనయై ఇసుకలో పిచ్చిగీతలు గీస్తున్న శిల్ప పరీక్ష తప్పిన విద్యార్థినిలా వుంది. ఒడ్డును దాటగలనన్న నమ్మకంతో ఉవ్వెత్తున పైకిలేచి తిరిగి వెనక్కి వెళ్ళిపోయిన పిల్ల కెరటంలావుంది.

“శిల్పా!”

యోగేంద్ర పిలుపుతో తలపైకెత్తింది.

పేలిపోయే నీటి బుడగల్లా వున్నాయి ఆమె కళ్ళు.

ఆది నుండి నువ్వు జీవితాన్ని ఒకే కోణంలో చూడటం అలవాటు చేసుకున్నావు. అఫ్‌కోర్స్ అది కేవలం నీ పొరపాటు మాత్రమే కాదు.... నువ్వు పెరిగిన వాతావరణం తద్వారా సంక్రమించిన స్వాతిశయంతో పాటు నీ ఆలోచనలలో మార్పుకు దోహదం చేయని పరిసరాలు కూడా కొంత కారణమే .”

మనో నిబ్బరం సడలిపోయిన శిల్ప ఆ మాటలకు ఎప్పటిలా విరుచుకు పడలేదు.

వీలైనంత సరళంగా విషయాన్ని తలకెక్కించాలనుకున్న యోగేంద్ర తన కంఠంలోని మృదుత్వం సడలిపోకుండా జాగ్రత్తపడ్డాడు.

“నా ప్రయత్నంలోని ముఖ్యోద్దేశం నన్ను కించపరచటమూ కాదు, కిరీటి ప్రవర్తనను సమర్థించడమూ కాదు. నీకు తెలిసుండీ మరుగున పడిపోయిన యధార్థాన్ని వెలికితీయుటమే ...” ఆమె ముఖకవళికల్ని చూస్తూ ఒక్క క్షణం ఆడిగాడు.

“శిల్పా! ఉదయన్నే నిద్రలేచి ఒకే కిటికీలోనుంచి బయటకు చూస్తున్నారు ఇద్దరు వ్యక్తులు, బయట ఏం కనిపిస్తుందో చెప్పమని అడిగితే ఒక వ్య క్తేమో అందమైన సూర్యోదయం గురించి, పచ్చని ప్రకృతి గురించి, ప్రఫుల్ల వదణాలతో పరుగులెత్తే మనుషుల గురించి ఏకరువు పెట్టాడట. మరో వ్య క్తేమో బయట పేరుకుపోయిన పెంటకుప్పల గురించి, బురదలో కూరుకుపోయిన పందుల గురించి, వీధుల్లో నిండిపోయిన మురికి చీదరించుకుంటూ వర్ణించి చెప్పాడట. ఈ వైవిధ్యానికి కారణమేమింటావు? చూసే దృష్టిలోను, స్పందించే మనసులోనూ గల వ్యత్యాసమే అంటే నువ్వు కాదనగలవా...? అవును శిల్పా! జీవితమూ అంతే. కాబట్టి ఆదిలోనే మనసులోనే ద్వేషాన్ని నింపుకున్న నువ్వు కిరీటిని యీ రోజువరకూ అంచనా వేయలేక పోయావు. ప్రేమించగలిగే మనసే నీకు లేనినాడు ప్రేమించే మనిషిని ఎలా అర్థం చేసుకుంటావు?”

"అంటే ఆయన నన్ను విపరీతంగా ప్రేమిస్తున్నారని నమ్మమంటావు."

"ప్రేమించటంలేదని నువ్వు నిరూపించగలవా?"

"ఆయన ప్రవర్తనే...."

"నాకు స్పష్టమైన జవాబు కావాలి."

"ఎన్నో సార్లు ఆయనకు దగ్గర కావాలనుకున్నాను. కాని ఆయన కావాలని నాకు దూరంగా జరిగిపోయేవారు."

"ఎన్నో మార్లు ఆయన నీకు దగ్గర కావాలనుకున్నాడు. కాని ప్రతిసారి కన్యపేరో, మరో జయశ్రీ పేరో చెప్పి ఆయన్ని బాధపెట్టి దూరం నెట్టేసే దానివి.... ఇది ఆయన అభిప్రాయం శిల్ప! ఆదిలోనే మాటలతో ఆయన్ని చిత్రవధ చేశావే, ఒకవేళ నీకు దగ్గర కావటమే ధ్యేయమైతే ఏనాడైనా కనీసం చెప్పటానికి సిగ్గయితే ఉత్తరం ద్వారానైనా క్షమార్పణాలు చెప్పుకున్నావా?" అనుమానంగా అడిగాడు.

"నా కంత ఖర్మ పట్టలేదు."

రాజా నరేంద్రదేవ్ మనువరాలు ఎన్నటికీ అటువంటి పని చేయదు అన్నంత ధీమాగా జవాబు చెప్పింది.

మూతి ముడుచుక్కూర్చున్న శిల్ప పసిపల్లలా అనిపించింది.

"చెప్పానుగా శిల్పా! నీదో విచిత్ర వ్యక్తిత్వమని. నీ మాట చెల్లటం లేదన్న మంకుతనం తప్ప నీకేం కావాలో నీకే స్పష్టంగా తెలీదు. నీగురించి నీకే అవగాహన లేని నాడు మరొకర్నెలా అర్థం చేసుకో గలవు. అంతెందుకు, కిరీటి నీకోసం ప్రత్యేకించి ఓ బొమ్మని తీసుకొచ్చి ప్రజంట్ చేశాడు కదా.... ఆ బొమ్మ ఎందుకిచ్చాడు? దానిలో అంతరార్థం ఏమిటి అని ఎప్పుడయినా ఆలోచించావా?"

సూటిగా అడిగిన అతని ప్రశ్నకు బిక్కమొహం పెట్టింది శిల్ప.

"శిల్పా! ...." గంభీరంగా మారిపోయింది యోగేంద్ర కంఠం.

"ఆ బొమ్మను చూస్తుంటే సుమారు పదిహేను పదహారు సంవత్సరాల క్రిందట ఏ సంఘటనా నీకు గుర్తు రావటం లేదూ.... ఆ బొమ్మను చూస్తుంటే నీలోగిలిలో అనాథగా పెరిగిన నీతో ఆడుకున్న తోటమాలి నర్సయ్య తాత మనువడు రూపం జ్ఞప్తికి రావటం లేదా.... నువ్వు అపురూపంగా చూసుకునే ఆ బొమ్మ చేయి విరిచాడన్న అతి చిన్న నేరానికి దారుణంగా దండించి బడిన ఓ పసివాడి ఆర్తనాదం నీకు వినబడటం లేదూ.... ప్రాణం లేని బొమ్మ కోసం ప్రాణం వున్న ఆ పసికందు వీపుపై నీ తండ్రి వాతలు పెడుతుంటే కిట్టూ చేసిన ఆక్రందనలు నీ చెవికి సోకటంలేదూ...!"

"అవును .... అప్పుడు కిట్టూ మనిద్దరితోనూ ఆడుకుంటున్నాడు. కిట్టూ నా బొమ్మ చెయ్యి విరిచాడు. నాన్నగారు వాతలు పెట్టేవరకు నా దు:ఖం ఆగలేదు. ఆ సమయంలో నరసయ్య తాత

ముందు ఆనాటి దృశ్యం లీలగా మెదులుతుంటే కలలోలా చెప్పుకు పోయింది.

"ఆ తర్వాత బ్రతుకు తెరువుకోసం మరెక్కడికో బయలుదేరిన నర్సయ్య తాత అప్పటికే జబ్బుపడి వుండటంతోనూ మీ నాన్నగారు కొట్టిన దెబ్బలు మరింత క్రుంగదీయటంతోనూ మార్గమధ్యంలోనే ప్రాణాలు వదిలాడు. కిట్టూ ఒంటరి వాడైపోయాడు." చెబుతున్న యోగేంద్ర అర్థోక్తిలో ఆగిపోయాడు.

"కాని ఆనాటి కిట్టూకి కిరీటి తెచ్చిన బొమ్మకి సంబంధం ఏమిటి?" అర్థం కానట్టుగా అడిగింది.

"చాలా వుంది శిల్పా... ఆనాటి కిట్టూయే నీ భర్త కిరీటి."

"బావా!" ఆశ్చర్యంగా నోరు తెరచింది.

ఏమిటి! అమయకుడైన కిట్టూ ఇంతవాడయ్యాడా! తను ఎంత చీదరించుకున్నా చిరునవ్వుతో తన చెంతకు వచ్చే కిట్టూ ఇంత ప్రయోజకుడయ్యాడా.... ఎలా?

"అంతే కాదు శిల్పా... నువ్వు ఆవేశంతో సరిగ్గా గుర్తించలేక చించి పారేచిన స్త్రీ ఫొటో మరెవరిదో కాదు నీ మేనత్త, కిరీటి తల్లి అయిన మాలినీ దేవి."

దిగ్భ్రమతో ఆమెకు నోట మాట రాలేదు.

"శిల్పా! అన్నీ అనుకూలంగా ఉండి వుంటే కిరీటి కూడా నీతో పాటు ఆ లోగిలిలో పెరగాల్సిన వాడే. కాని మాలినీ దేవి ఓ పేద బడి పంతుల్ని ప్రేమించి రహస్యంగా పెళ్ళి చేసుకోవటంతో మీ తాతగారి ఆగ్రహానికిలోనై ఆ లోగిలి నుండి బహిష్కరించబడింది. పాముకాటు మూలంగా భర్త మరణించటంతో మంచం పట్టిన ఆమె తన అంత్య దశలో కిరీటిని నర్సయ్య తాతకు అప్పచెప్పి అతడు అనాధ కాకూడదని ఎప్పటికైనా ఆ లోగిలిలో ఒక మనిషిగా అర్హతను సంపాదించు కోవాలని దానికి కావలసిన సహాయం అందించమని వేడుకుంటూ ప్రాణాలు వదిలింది. ఆ తర్వాత నర్సయ్య తాత తోటమాలినిగా అక్కడ అడుగు పెట్టి తన ప్రయత్నం ఫలించకుండానే విచిత్ర పరిస్థితుల్లో బయటకు తరిమేయబడి మొత్తమంతా కిరీటికి చెప్పి మరణించాడు. అనాధగా మారిన కిరీటి అదృష్టంగా చక్రవర్తిగారి ఆశ్రయం లభించింది. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోకుండా అహోరాత్రులు కష్టపడి అర్హతలు పొందగలిగాడు. జ్ఞానం తెలీని వయసునుండి నీపై పెంచుకున్న ఆరాధనకి రూపం ఇవ్వాలన్న తలంపుతోను, అమ్మ ఆఖరి కోరిక నెరవేర్చాలన్న వూహతోను ఎంతో కృషి చేసి ఎవరూ వూహించనంత ఎత్తుకెదిగాడు. అవకాశం లభించగానే యుక్తిగా నిన్ను తనదాన్ని చేసుకుని జీవితంలో అంతా సాధించ గలిగానని సంబరపడిపోయాడు."

"కాని ఇదంతా ముందే నాకెందుకు చెప్పలేదు?"

"ముందుగా చెబితే ఒక వేళ నువ్వు కాదంటే నిన్ను పొందే అదృష్టానికి తనెక్కడ దూరమైతానోనని భయపడ్డాడు. తర్వాత ఎన్ని సార్లు చెప్పాలను కున్నా నీ అహంకారాన్ని--

'ఏదో బావాని చూసి చెబితే మరింత చీదరించు కుంటావేమోనని సందేహించాడు

అనురాగంతో నువ్వు  చేరువైన రోజున అంతా చెప్పాలనుకుని, నిన్ను ఆశ్చర్యంలో ముంచేయాలని కలలు కంటూ కాలం గడిపేస్తున్నాడు.”

“అసలు నీకిదంతా......”

“నిన్నగాక  మొన్ననే చెప్పాడు. గెస్ట్ హౌస్‌కు తీసుకు వెళ్ళి కన్యను నన్ను వివాహం చేసుకోమని ప్రాధేయపడుతూ  మొత్తం తన కథను వినిపించాడు.”

సిగ్గుతో తలవంచింది.

ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తుంటే ఆమె మనసు మబ్బు విడిన ఆకాశంగా ఆరినందుకు నిట్టూర్చాడు.

“శిల్పా! నీకు తెలీదు కిరీటి నిన్నెంత ఆరాధిస్తున్నాడో... నీ అనురాగాన్ని పొందలేనందుకు మానసికంగా అతడెంత కృంగోపోయున్నాడో నీకు అర్థం కాదు.... శిల్పా! ప్రతి మగాడి ఔన్నత్యం వెనుక  ఒక ఆడదాని అదృశ్య హస్తముంటుందంటారు. కాని రోజురోజుకీ దిగజారిపోతున్న కిరీటి పరిస్థితి చూస్తుంటే  మేధావుల పతనానికి కూడా ఒక మగువ కారణం కాగలదనిపిస్తుంది.... శిల్పా! యీ సంఘానికి కిరీటి వంటి జీనియస్‌లు చాలా అవసరం.... నీ నిర్లక్ష్యంతో అతడిన్నింకా బాధపెట్టి....”

“బావా...! ” ఆమె గొంతు పూడుకుపోయింది. పైట చెరగుతో కళ్ళు వత్తుకుంటూ కుమిలి కుమిలి ఏడ్చింది.

“శిల్పా!” యోగేంద్ర  పెదవులపై  చిరునవ్వు మెరిసింది.

“నీ కన్నీటితో మనసుపై పేరుకుపోయిన మకిలిని కడిగేసుకోగలిగావు. ఇక అట్టే వృథా చేయకు....లే...”

ఇప్పుడామె తపస్వినిగా ఉంది.

ఎన్నో ఏళ్ళు సుషుప్తినుండి జాగ్రదావస్థకి  చేరుకున్నట్టుగా వుంది.

కడిగిన ముత్యంలా బంగళాలోకి  అడుగుపెట్టిన శిల్పకు దేనికో ఆందోళన పడుతున్నట్టుగా ఎదురైంది.

“శిల్పా... ఎంతపని చేశావమ్మా.... జీవితంపై విసుగుపుట్టిన కిరీటి ఎక్కడికో వెళ్ళిపోతున్నాడమ్మా... మనల్నందర్నీ దూరంగా కాదని వెళ్ళిపోతున్నాడు.” హడావిడిగా చెప్పింది కన్య.

నిర్లిప్తంగా  నిలబడి పోయాడు యోగేంద్ర.

“నో, ఆయనెక్కడికీ  వెళ్ళడు.... వెళ్ళనివ్వను....” భయాందోళనలతో బయటకు పరుగెత్తింది శిల్ప.

తనే కారు డ్రైవ్ చేసుకుంటూ ఆఘమేఘాలపై ఎయిర్‌పోర్టుకి వెళ్ళింది.

కిరీటి రూఢిగా అక్కడే వుంటాడన్న నమ్మకం లేదు.

కాని కిరీటిని అక్కడ కలుసుకోగలనని ఆమెకు అనిపించింది.

కలుసుకోవాలని కోటి దేవుళ్ళకు మ్రొక్కుకుంది.

కాళ్ళపై పడి వేడుకోవాలని కన్నీటితో అతని పాదాలను కడిగేయాలని ...

ఆమె ఊహ నిజమైంది ....

లాంజ్‌లో నిలబడి దిగంతాలవేపు నిశ్చలంగా చూస్తూ ఉన్నాడు కిరీటి.

మరికొన్ని నిమిషాలలో బాంబే ఫ్లయిట్ బయలు దేరబోతున్నట్టుగా అనౌన్స్‌మెంట్ వినిపించింది.

“ఏమండీ!”

ఒక్కఅంగలో అతన్ని చేరుకుంది. పరిసరాలను గమనించే స్థితిలో లేదు.

“నన్ను క్షమించండి.... నా తప్పులు తెలుసుకున్నానండి... మీరెక్కడికి వెళ్ళొద్దండీ” వెక్కి వెక్కి ఏడుస్తూ ప్రాధేయపడింది.

“యూ ఆర్ టూ లేట్ శిల్పా!” అతడు ముందుకు కదిలాడు.

కళ్ళు నిండిన నీళ్ళతో అలాగే చూస్తూ నిలబడి పోయింది శిల్ప. శరీరంలో శక్తి సన్నగిల్లినట్టుగా ఆలస్యంగా గుర్తించిన శరీరానికి అదృష్టం చేజారినట్టుగా తలవంచుకుని ఏడుస్తూ వుండిపోయింది.

ఆకాశంలోకి ఎగురుతున్న విమానాన్ని చూస్తూ అచేతనంగా నిలబడిపోయింది.

ఆమెకిప్పుడు కన్నీళ్ళు రావటంలేదు.

నిర్వేదంగా నవ్వుకుంది.

అవును...... తనకిదే శాస్తి.

స్వయంకృతం... నిజంగా తను కుళ్ళికుళ్ళి ఏడవాలి.

ఆయన అన్నట్టు తాను పోగొట్టుకున్నదేమిటో తలచుకుంటూ రోజూ చస్తూ బ్రతకాలి .

యస్... ఐ డిజర్వ్ దిస్.... ఐ డిజర్వ్ దిస్....

కారు ఎలా డ్రైవ్ చేసిందో.... బంగళాకి ఎలా చేరుకుందో ఆమెకు తెలీదు.

నిరాసక్తంగా గదిలోకి అడుగు పెట్టిన శిల్ప స్థిమితంగా కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్న కిరీటిని చూసి అదిరిపడింది.

ఇది నిజమేనా.... మళ్ళీ తను భ్రమ పడుతోందా?

గాలిలో కెగిరిన వ్యక్తి నేలపైకి ఎలావచ్చేశాడు?

మృదు మందహాసంతో దేవుడిచ్చిన వరంలా వరాలిచ్చే దేవుడిలా తదేకంగా తననే చూస్తూ కూర్చున్న కిరీటి కరుసుకున్నా చిలిపినవ్వుతో దగ్గరికి చేరే కిట్టూలా అనిపించింది.

మంత్రముగ్ధలా ముందుకు నడచింది.

అలసటగా అతని పాదాలపై వాలిపోయింది.

ముడుచుకుపోతూ, “నన్ను క్షమించరూ” అంది ఆర్ద్రతగా....

ఆమె మరేదో చెప్పబోతుంటే ‘యీ పెదవుల్నిలా వదిలేస్తే పేరాల కొద్దీ డైలాగ్స్ చెప్పేట్టున్నాయి’ అనుకుంటూ వాటికా అవకాశం ఇవ్వకుండా చేయాలని ముందుకు వంగాడు.

‘గోల్’ చేరిన జంటను చూసిన ‘డాల్’ అల్లరిగా కళ్ళను తిప్పుతూ కూర్చుంది.

-----: అయిపోయింది :-----